సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



ఇలా అయితే విజయం మీదే..

పోటీ పరీక్షల్లో వైవిధ్యమైన ఆలోచనకు సృజనాత్మకత జోడించడం ద్వారా విజయం సాధించవచ్చని అబ్దుల్ కరీం అన్నారు. 8లో



ఓటు హక్కు కోల్పోకుండా..!

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణను మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. 8లో

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. 8లో



‘దివ్యం’గా ఆడారు

గెలుపు కాంక్షను రగిలిస్తాం.. ఉత్సాహంగా ఉరకలేస్తాం.. ఊపిరినే రెక్కలుగా మలిచి.. విజయతీరాలకు చేరుతాం.. గెలుపు ఒక్కరిదే అయినా.. క్రీడాస్ఫూర్తిని ఇనుమడింప చేస్తాం..! మా ఆశలకు అద్భుతాన్ని జోడిస్తాం.. అంటూ ప్రత్యేక బాలలు ఏకమై నినదించారు. జేసీఐ వైజాగ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్స్‌లో స్పెషల్ ఒలింపిక్స్ పేరిట నిర్వహించిన 50 మీటర్ల పరుగు, డిస్క్‌త్రో, సాఫ్ట్‌బాల్ త్రో, 3, 4 కేజీల షాట్‌పుట్, రిలే రేస్ అంశాల్లో అదరగొట్టారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 18 పాఠశాలల నుంచి వినికిడి, దృష్టి లోపాలతోపాటు శారీరక, మానసిక వైకల్యాలున్న విద్యార్థులు పాల్గొన్నారు. 10లో



సంప్రదాయ సందడి

కేరళీయులు అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఉత్సాహభరితంగా జరుపుకొనే పండగ ఓనం. మహాబలి ఆగమనాన్ని పురస్కరించుకొని కేరళ వాసులు ఓనం పండగను సంబరాల మధ్య జరుపుకుంటారు. ఘనమైన సంస్కృతి సంప్రదాయాలకు వారసత్వంగా ఈ పండగను నిర్వహిస్తారు. తొలిరోజు అతం పేరుతో ప్రారంభమైన ఉత్సవాలు పదో రోజు ఆదివారం తిరు ఓనంతో ముగిశాయి. బిర్లా కూడలిలోని కేరళ కళా సమితిలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై కేరళీయులకు ఓనం శుభాకాంక్షలు తెలిపారు. కేరళీయుల నృత్యాలు, విందు భోజనాలు, పులివేషాలు అలరించాయి.

- మురళీనగర్



మెడ్‌టెక్ జోన్‌లో జీ-20 ట్రేడ్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : జీ-20 ప్రెసిడెన్సీని పూర్తి చేసుకున్న భారత్ తరఫున సదస్సుకు శాశ్వత వాణిజ్య సహకారం అందించే బాధ్యతను విశాఖలోని వైద్య ఉపకరణాల తయారీ కేంద్రం ఏపీ మెడ్ టెక్ జోన్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో మెడ్ టెక్ జోన్‌లో మొట్టమొదటి జీ-20 ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మెడ్ టెక్ జోన్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ప్రాణాల్ని రక్షించేందుకు అవసరమైన వైద్య పరికరాల్ని తయారు చేసే కీలక కేంద్రంగా వివిధ దేశాలతో ద్వైపాక్షిక, బహుపాక్షిక భాగస్వామ్యాలు చేపట్టేందుకు ఈ ట్రేడ్ సెంటర్ ముఖ్య భూమిక పోషించనుంది.

న్యూస్‌రీల్

మంత్రి అమర్‌కు గంగవరం పోర్టు కార్మికుల కృతజ్ఞతలు



మిందిలో మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మిందిలోని ఆయన నివాసంలో గంగవరం పోర్టు కార్మికులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్కరించారు. యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తిప్పల గురుమూర్తి రెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, కసిరెడ్డి సత్యనారాయణ, చీకటి అప్పారావు, పోర్టు నిర్వాసిత ఉద్యోగులు జి.అమ్మోరు, నొల్లి తాతారావు, కదిరి సత్యారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



కేంద్ర మంత్రి శర్బానందతో బీజేపీ నేతలు

గోపాలపట్నం: కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌కు విశాఖ విమానాశ్రయంలో ఆదివారం సాదర స్వాగతం లభించింది. ఆయనకు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, కాశీవిశ్వనాథ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేశ్వరరావు స్వాగతం పలికి సత్కరించారు.

కాలుష్య నియంత్రణ సామర్థ్య విస్తరణ



ట్రక్ టెర్మినల్ ముఖ ద్వారం

విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రగతి పథంలో పయనిస్తోంది. నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతూ ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. పోర్టు ద్వారా నగరంలోకి వస్తున్న కాలుష్య నియంత్రణతో పాటు సామర్థ్యాన్ని విస్తరించే ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించింది. రూ.237.51 కోట్ల అభివృద్ధి పనులకు ఈ నెల 4న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది.

- సరికొత్త ప్రణాళికలతో విశాఖపట్నం పోర్టు అడుగులు
- మేజర్ పోర్టులతో పోటీపడుతూ అభివృద్ధి పనులు
- నేడు కేంద్ర మంత్రి శర్బానంద చేతుల మీదుగా శ్రీకారం

రూ.237.51 కోట్లతో పోర్టులో చేపడుతున్న విస్తరణ పనులు

రూ.33.80 కోట్లతో కవర్డ్ స్టోరేజ్ యార్డులు నిర్మాణం

రూ.167.66 కోట్లతో బెర్త్‌ల పునరుద్ధరణ పనులు

రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్ నిర్మాణం

సాక్షి, విశాఖపట్నం : పెట్టుబడుల ప్రవాహం.. పెరుగుతున్న సామర్థ్యానికి అనుగుణంగా విస్తరణ పనులతో విశాఖ పోర్టు అథారిటీ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సరికొత్త సొబగులద్దుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతుండటంతో విశాఖ పోర్టు ప్రపంచ వాణిజ్య కేంద్రానికి చిరునామాగా మారనుంది. ఈ పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేసి దేశంలోని మేజర్ పోర్టుల్లో నాలుగో స్థానంలో నిలిచిన విశాఖను నెంబర్ వన్‌గా నిలబెట్టాలని వీపీఏ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ట్రక్ పార్కింగ్ టెర్మినల్ పనుల వేగం పుంజుకుంది.



కవర్డ్ స్టోరేజ్ యార్డులు

రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్

ప్రస్తుతం పోర్టుకు ఉన్న ట్రక్ పార్కింగ్ సామర్థ్యం 300 వాహనాలు మాత్రమే. అయితే పోర్టు అనుబంధ సంస్థ విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రాజెక్టు లిమిటెడ్ (వీసీటీపీఎల్) సామర్థ్యం రమారమి 5 లక్షల టీఈయూ (20 ఫుట్‌కంటైనర్) వరకు ఉంది. దీంతో పాటు 300 నుంచి 500 వరకూ ట్రైలర్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. వీసీటీపీఎల్ విస్తరణ పనులు సాగుతుండటంతో సామర్థ్యం మరో 5 లక్షల టీఈయూలతో పాటు మరో 300 నుంచి 400 వాహనాలు అదనంగా వచ్చే అవకాశాలున్నాయి. ఈ కారణం వల్ల మరో ట్రక్ టెర్మినల్ అవసరమని భావించిన పోర్టు 20 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను నిర్మించింది. రూ.36.05 కోట్లతో రూపుదిద్దుకున్న ఈ టెర్మినల్ పోర్టుకు వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు అవాంతరాలు లేని వాహనాల రవాణా కోసం ఉపయోగపడనుంది. ఈ టెర్మినల్‌లో మొత్తం 666 వాహనాల పార్కింగ్ చేసుకునే సౌలభ్యం ఉంది. 100 బెడ్‌లతో కూడిన డార్మెటరీతో పాటు 9 దుకాణాలు, ఏటీఎం, వాహనాల విడిభాగాల విక్రయ కేంద్రాన్ని కూడా నిర్మించారు.

నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా..

విశాఖలో పోర్టు కాలుష్యం దాదాపు తగ్గినప్పటికీ బొగ్గు నిల్వల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోర్టు నుంచి సుమారు 3 చదరపు కిలోమీటర్ల వరకూ బొగ్గుకు సంబంధించిన నల్లటి రేణువులు విస్తరించి కలుషితంగా నగరం మారుతోంది. దీన్ని అధిగమించేందుకు విశాఖ పోర్టు కవర్డ్ స్టోరేజ్ షెడ్లు నిర్మించింది. ఇప్పటికే టార్పాలిన్లు కప్పుతూ లారీల ద్వారా లోడ్స్ తీసుకొస్తున్నారు. ఆ లారీలు నేరుగా షెడ్లలోకి వెళ్లి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తాయి. దీని వల్ల ఆ సమయంలో ఎగిరే బొగ్గు కణాలన్నీ షెడ్‌ల లోనే ఉండిపోతాయి. బయటకు ఎగరకుండా ఉంటాయి. దీని వల్ల నగరంలోకి ఎగిరే బొగ్గు రేణువుల శాతం గణనీయంగా తగ్గుతుంది. రూ.33.80 కోట్ల వ్యయంతో ఆర్-11 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజ్ యార్డును నిర్మించారు. స్టాక్ యార్డుల నుంచి ఉత్పత్తయ్యే కాలుష్యాన్ని నియంత్రించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ యార్డు ద్వారా 84,000 టన్నుల బల్క్, బ్యాగ్‌డ్ కార్గోను నిర్వహించగలరు. ఇవి అందుబాటులోకి రావడంతో కాలుష్యం మరింత తగ్గే అవకాశం ఉంది.



ఆధునికీకరించిన ఓఆర్-1 బెర్త్

ఓఆర్-1, 2, 3 బెర్తుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం

విశాఖ పోర్టును ఏ విధంగా విస్తరించాలనే అంశంపై విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. బెర్తుల ఆధునికీకరణ, సామర్థ్య విస్తరణతో పాటు సరికొత్త పనులకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు చానెల్స్, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి సైతం ఆదాయం ఆర్జించేలా సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తులు రవాణా జరుగుతుంటుంది. భవిష్యత్తులో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీ సామర్థ్యాన్ని కూడా పెంచేలా పోర్టు పనులు ప్రారంభించింది. ఓఆర్-1, ఓఆర్-2, ఓఆర్-3 బెర్తుల పునరుద్ధరణ పనులకు రూ.167.66 కోట్లతో శ్రీకారం చుట్టింది. 14.5 మీటర్ల డ్రాఫ్ట్ వెసల్స్, 85 వేల డీడబ్ల్యూ వెసల్స్‌ను హ్యాండిల్ చేసే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే 243 మీటర్ల పొడవుతో 3.81 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఓఆర్-1 బెర్త్ అందుబాటులోకి వచ్చింది. ఓఆర్-2, ఓఆర్-3 బెర్తుల ఆధునికీకరణ పనులు 2024 అక్టోబర్ నాటికి పూర్తికానున్నాయి. ఈ పనులను కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఈ నెల 4న ప్రారంభించనున్నారు.

సంగీత నృత్యోత్సవంతో విశాఖ కీర్తి



టి.ఎం.కృష్ణ గాత్ర కచేరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సంగీత నృత్యోత్సవంతో విశాఖ కీర్తి మరింత ఇనుమడింపచేశారని రియల్ అడ్మిరల్ విజయశేఖర్ అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండో రోజు కార్యక్రమానికి రియల్ అడ్మిరల్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్. వి.ఆర్.కె.రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రియల్ అడ్మిరల్ విజయశేఖర్ మాట్లాడుతూ సంగీత ప్రియులు, నాట్య అభిమానులు, నాటక ప్రియులు వారం రోజుల పండగ చేసుకునేలా ఎంతో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం టి.ఎం.కృష్ణ గాత్ర కచేరి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. కచేరికి ప్రసిద్ధ వయోలిన్ విద్వాంసుడు హెచ్.ఎన్.భాస్కర్, మృదంగంపై డాక్టర్ వంకాయల వెంకట రమణ సహకారం అందించారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వైరస్‌ల నియంత్రణ

కొమ్మాది : కరోనా వైరస్ ఒక దేశం నుంచి మరో దేశానికి విస్తరించకుండా ఉండాలంటే ప్రపంచ ఆరోగ్య నియంత్రణ సూత్రాలు విధిగా అమలు చేయాలని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అనుబంధ విభాగం ఎయిర్ పోర్టు హెల్త్ ఆర్గనైజేషన్ అధిపతి డాక్టర్ ఎం.అనురాధ అన్నారు. గీతం ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ 28వ వార్షిక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన ఆరోగ్య నియంత్రణను పూర్తి స్థాయిలో కేవలం 64 దేశాలు మాత్రమే అమలు చేస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ టీబీ నియంత్రణ ప్రాజెక్టు సాంకేతిక సలహాదారులు డాక్టర్ ఎం.విజ్ఞేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు పురస్కారం

బిడ్డను విద్యార్థిగా మార్చే అక్షరాల ఒడి.. బడి. ఆ ఒడిలో పిల్లలు హాయిగా అక్షరాలు దిద్దాలి. భవిష్యత్తును బంగారంగా దిద్దుకోవాలి. బిడ్డల భవిష్యత్తును దిద్దే చేతులకు వందనం. ఉపాధ్యాయ వృత్తికి వందనం. వృత్తికి వన్నె తెచ్చిన గురువులకు వందనం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 5వ తేదీ గురుపూజోత్సవం నిర్వహిస్తుండగా ఈ సారి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. విశాఖ జిల్లాలో పురస్కారాన్ని అందుకోనున్న పలువురు గురువులపై ఈ ప్రత్యేక కథనం.

– మద్దిలపాలెం/కంచరపాలెం/సబ్బవరం



పేరు: పోలా ఉమామహేశ్వరరావు,
వృత్తి : సంస్కృతం అధ్యాపకుడు
పనిచేస్తున్న ప్రాంతం :
వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

విజయనగరం జిల్లా సీతానగరం మండలం కృష్ణరాయపురం గ్రామానికి చెందిన ఈయన డిగ్రీ, పీజీ విజయనగరం మహారాజా కళాశాలలో సంస్కృతం చదివారు. ఏయూలో డాక్టరేట్ పూర్తి చేశారు. ప్రస్తుతం డాక్టర్.వి.ఎస్.కృష్ణా కళాశాలలో సంస్కృతం విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. 26 సంవత్సరాలుగా సంస్కృతం అధ్యాపకుడుగా, జాతీయ సేవా పథకంలో ఏడు సంవత్సరాలు ప్రోగామ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడుగా ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందని అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు తెలిపారు.



పేరు: గట్టు రాజుకుమార్,
వృత్తి : కామర్స్ అధ్యాపకుడు
పనిచేస్తున్న ప్రాంతం : వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఈయన ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ, అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో మాస్టర్ ఆఫ్ కామర్స్ పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. 1999లో వి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడిగా విధుల్లో చేరారు. 2010లో పదోన్నతిపై నర్సీపట్నం డిగ్రీ కళాశాల అధ్యాపకుడుగా పనిచేశారు. 2013లో చోడవరం డిగ్రీ కళాశాల, ప్రస్తుతం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీజీ కళాశాలలో కామర్స్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.



పేరు : పలుకుర్తి మేరీ అనుపమ,
వృత్తి : బయోకెమిస్ట్రీ విభాగాధిపతి
పనిచేస్తున్న ప్రాంతం : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల

పీహెచ్‌డీలో గోల్డ్ మెడల్ అందుకున్న ఈమె టీచింగ్‌తో పాటు రీసెర్చ్ చేస్తున్నారు. క్యాన్సర్ నిరోధక ఔషధంపై యూజీసీ ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 31 పరిశోధన ప్రచురణలను ప్రచురించారు. ఎథిక్స్‌పై ఒక పుస్తకాన్ని రాశారు. రియాక్టర్ల కల్పనలో మక్కువ ఉన్న అనుపమ తన పరిశోధన పనుల కోసం రెండు రియాక్టర్లను తయారుచేశారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీలోని వివిధ రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఆమె వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.



పేరు : ఎస్.సత్యనారాయణ,
వృత్తి : తెలుగు అధ్యాపకుడు
పనిచేస్తున్న ప్రాంతం :
సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఈయనది విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామం. పాఠశాల విద్య అంతా బాడంగిలో సాగింది. ఇంటర్, డిగ్రీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో చదివారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ(తెలుగు), ఎంఏ(సంస్కృతం), బీఈడీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. తొలుత మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, తర్వాత నర్సీపట్నం జూనియర్ కళాశాలలో పనిచేశారు. పదోన్నతిపై యలమంచిలి డిగ్రీ కళాశాలలోను, ఆ తర్వాత చోడవరంలో కొన్నాళ్లు పనిచేశారు. ప్రస్తుతం సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడి పనిచేస్తున్నారు. బోధన, పరిశోధన, సమాజ సేవలో ముందున్న ఆయన రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడంపై తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఏయూ ఆచార్యులకు రాష్ట్ర స్థాయి అవార్డులు



ఎన్.కిశోర్ బాబు | పి.శ్యామల | సి.వి.నాయుడు | కె.సీతామాణిక్యం | కె.రమాసుధ | లలిత భాస్కరి

ఏయూక్యాంపస్: ఏటా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఆచార్యుల పురస్కారానికి ఏయూ నుంచి ఈ సంవత్సరం ఆరుగురు ఆచార్యులు ఎంపికయ్యారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల నుంచి అకడమిక్ డీన్‌గా సేవలందిస్తున్న కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, సైన్స్ కళాశాల పరిధిలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, మీటియరాలజీ విభాగ ఆచార్యులు సి.వి.నాయుడు, న్యాయ కళాశాల నుంచి ఆచార్య కె.సీతామాణిక్యం, ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు కె.రమాసుధ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు, ఐక్యూఏసి డైరెక్టర్ ఆచార్య డి.లలితభాస్కరి ఉత్తమ ఆచార్యులుగా ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన ఏయూ స్నాతకోత్సవ మందిరం వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు పురస్కారాలను అందుకోనున్నారు.

మహిళలకు అగ్రాసనం : ఈ సంవత్సరం పురస్కారాలు స్వీకరిస్తున్న వారిలో నలుగురు మహిళలు ఉండటం విశేషం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాలక మండలి నుంచి పరిపాలన పదవుల వరకు మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఏయూ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇదే తరహాలో నేడు నలుగురు మహిళా ఆచార్యులు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని అందుకోనున్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

- పరిశ్రమలకు వారంలో ఒక రోజు పవర్ హాలిడే
- వైద్య సంబంధిత పరిశ్రమలు, రైస్ మిల్లులకు మినహాయింపు
- రెండు వారాల పాటు పవర్ హాలిడే అమలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి


పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి విశాఖపట్నం : గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుందని ఇంకా 40 మిలియన్ యూనిట్ల వరకూ కొరత వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాల అవసరాలకు తగిన ప్రాధాన్యమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ సాగు కోసం ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం వాటి ప్రస్తుత ధరల్ని పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించినట్లు వివరించారు. ఇందులో భాగంగా సంస్థ పరిధిలో నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాలని, సాయంత్రం 6 తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలిడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5 నుంచి 15 వరకూ రెండు వారాల పాటు పవర్ హాలిడే అమల్లో ఉంటుందని వివరించారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించే పరిశ్రమలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వీలైనంత త్వరగా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తామని విద్యుత్ లభ్యత మెరుగైనట్లయితే పవర్ హాలిడేను ఎత్తివేస్తామని, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు ఏపీఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేసి తెలపవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.

విజ్ఞానానికి వివేకం తోడైతే విజయం మీదే..

- 'సాక్షి' మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్తంగా గ్రూప్–2 ఉద్యోగాలపై అవగాహన
- హాజరైన లెజెండరీ ఫ్యాకల్టీలు అబ్దుల్ కరీం, కృష్ణారెడ్డి, పాషా, హరికృష్ణ
- త్వరలో గ్రూప్–2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు


మాట్లాడుతున్న హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం. చిత్రంలో ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: పోటీ పరీక్షల్లో వైవిధ్యమైన ఆలోచనకు సృజనాత్మకత జోడించడం ద్వారా విజయం సాధించవచ్చని హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. ఎంత మంది విద్యార్థులు పోటీ పరీక్షలు రాసినా..విజ్ఞానంతో పాటు వివేకం తోడైతేనే విజయం సొంతమవుతుందని సూచించారు. రామా టాకీస్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో 'సాక్షి మీడియా గ్రూపు', 'హైదరాబాద్ ఆర్‌సీ ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సంస్థ' సంయుక్తంగా గ్రూపు–2 పోటీ పరీక్షలపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూపు–2 ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న సమయంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించడమే లక్ష్యంగా..ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సదస్సులో పోటీ పరీక్షల్లో నిష్ణాతులుగా పేరొందిన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎండీ పాషా తదితరులు గ్రూపు–2 పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అబ్దుల్ కరీం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో మన ప్రిపరేషన్ ప్రశ్నపత్రం స్థాయికంటే ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్స్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో శిక్షణ కఠినతరంగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం తెలుస్తుందని పేర్కొన్నారు. పోటీతీవ్రతను దృష్టిలో ఉంచుకుని మన పక్కవాని కంటే ఒక మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించేలా ఎప్పటికప్పుడు సబ్జెక్టులో అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. నిష్ణాతులైన, అనుభవం కలిగిన లెజండరీ ఫ్యాకల్టీ ఒకేచోట ఉన్న ఆర్‌సీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందితే విజయం మీ సొంతమవుతుందన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ హరికృష్ణ మాట్లాడుతూ ఇతరుల అనుభవాలను తెలుసు కోవడం ద్వారా అభ్యర్థులు విజయం సాధించవచ్చున్నారు. మనం చదివే ప్రతీ సబ్జెక్టును మనచుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలన్నారు. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయ రహస్యమన్నారు.

ఎకానమీ ఫ్యాకల్టీ ఎం.డి. పాషా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సమయం ఎంతో విలువైనదని, నోటిఫికేషన్ జారీచేసేలోగా సిలబస్ పూర్తి చేస్తే.. ప్రిపరేషన్లో ముందు ఉండాలన్నారు. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థులు విజయాన్ని డిసైడ్ చేస్తుందని, సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుందన్నారు.

పాలిటీ ఫ్యాకల్టీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ..పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. ఇందుకు తగ్గ విజయప్రణాళికను సిద్ధం చేసుకోవాలి సూచించారు.

టాపర్లకు నగదు బహుమతి

పోటీ పరీక్షల నిపుణులు గ్రూప్–2 పరీక్ష విధివిధానాలు, మార్కులు సులువుగా సాధించే అంశాలపై మెలకువలు, ఉదాహరణలతో వివరించారు. అనంతరం అభ్యర్థులకు ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించి..ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్, తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.శిరీషకు, ద్వితీయ స్థానంలో కె.ప్రతాప్, తృతీయ స్థానంలో పి.పవన్ కళ్యాణ్‌లకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' విశాఖ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, సాక్షి ప్రకటనల డీజీఎం శ్రీనివాసరావు, రీజినల్ ఈవెంట్ ఇన్‌చార్జి ఆర్.మారుతి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రెసిడెంట్ కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.


అవగాహన సదస్సుకు హాజరైన అభ్యర్థులు


ప్రథమ స్థానంలో నిలిచిన శిరీషకు నగదు బహుమతి అందిస్తున్న హిస్టరీ ఫ్యాకల్టీ అబ్దుల్ కరీం. చిత్రంలో మొండెం కిరణ్‌కుమార్

అత్యుత్తమ గ్రూప్–2 శిక్షణ అందిస్తున్నాం



వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజెండరీ ఫ్యాకల్టీలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటివరకూ ఆన్‌లైన్ విధానంలో వేల సంఖ్యలో అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి ఆఫ్‌లైన్ గ్రూప్–2 బ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్ వరకూ రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు కోసం ఆర్‌సీ ఎగ్జామ్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నాం. కోచింగ్‌కు సంబంధించిన ఇతర వివరాల కోసం 89850 94499 నంబర్‌లో సంప్రదించాలి. –మొండెం కిరణ్‌కుమార్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్, హైదరాబాద్

చక్కటి మార్గనిర్దేశం..



'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ పరీక్షలో ప్రథమ బహుమతి సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కటి మార్గనిర్దేశం చేశారు. ఈ అవగాహన సదస్సు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా సిద్ధపడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో వివరించారు.
– పి.శిరీష, ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి

ఉన్నత కొలువుల సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు దిక్సూచిలా ఉపయోగపడతాయి. ఈ అవగాహన కార్యక్రమంలో లక్ష్యాన్ని ఎలా సాధించాలో తెలుసుకున్నా. సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఉన్నత కొలువు సాధించాలనే నా లక్ష్యానికి ఈ సదస్సు చక్కటి మార్గనిర్దేశం చేసింది.
– ఆదారి లోకేష్, విద్యార్థి

ఆత్మవిశ్వాసం పెరిగింది



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందడంతో పాటు వారిలో నిత్యం విజయకాంక్ష ఉండేలా స్ఫూర్తి కలిగించారు. ప్రణాళికబద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని, ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతంగా అనిపించింది. గ్రూప్స్–2కు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సు ఓ వరం లాంటిది.
– కొట్ని నాగమణి, వడ్లపూడి, విద్యార్థి

నేత్రదానంతో చిరంజీవులుగా జీవిద్దాం


ర్యాలీ ప్రారంభిస్తున్న కేకే రాజు

బీచ్‌రోడ్డు: మరణానంతరం నేత్రదానం చేయడం వలన చిరంజీవులుగా జీవిద్దామని నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పిలుపునిచ్చారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీని కేకే రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోల్పోయి చాలా మంది బాధపడుతున్నారని వారి జీవితాల్లో నూతన వెలుగులు నింపేందుకు మరణించిన మన కుటుంబ సభ్యుల నేత్రాలను దానం చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్‌పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు జగనన్నకు చెబుదాంకార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

ఇన్‌స్టాలో పోస్టు పెట్టి యువకుడి ఆత్మహత్య


మృతుడు దల్లి రాజేశ్

సీతమ్మధార : ఏం జరిగిందో ఏమోగానీ ఓ యువకుడు ఇన్‌స్టాలో 'తాను చనిపోతున్నానని, తన మృతికి ఎవరూ కారణం కాదు'అని పోస్ట్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొండపర్తి రామాలయంలో వీధిలో రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. తల్లి టిఫిన్ షాపు నిర్వహిస్తుండగా తండ్రి శ్రీనివాస్ కేటరింగ్ పనులకు వెళుతుంటాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలోని వెళ్లి ఇన్‌స్టాగామ్‌లో ×నేను చనిపోతున్నాను.. ఇందులో ఎవరికి ప్రమేయం లేదని రాజేష్ పోస్టు పెట్టాడు. తన స్నేహితులు ఈ పోస్టు చూసి వెంటనే రాజేష్ సోదరుడికి ఫోన్ చేసి చెప్పారు. వెంటనే ఇంటి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే తలుపులు పగులకొట్టి దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీఐ విజయ కుమార్ ఆదేశాలమేరకు హెచ్‌సీ వరలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరు.

ప్రాణం తీసిన ఈత సరదా


విజయ్ కుమార్ మృతదేహం

కొమ్మాది: తన స్నేహితుడితో బీచ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన రుషికొండ బీచ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, లైఫ్ గార్డ్స్ తెలిపిన వివరాలు ప్రకారం పెందుర్తిలో నివాసం ఉంటున్న విజయ్ కుమార్ పట్నాయక్ (41), సిబిరాజ్ బెహరా ఇద్దరు స్నేహితులు. వీరు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు గడిపిన తరువాత బీచ్‌లో స్నానాలు చేసేందుకు వెళదామనుకున్నారు. ఆదివారం కావడంతో రుషికొండ బీచ్ పర్యాటకులతో నిండిపోయింది. ఈ క్రమంలో వీరిద్దరు కాస్త దూరంగా వెళ్లి స్నానాలు చేసేందుకు బీచ్‌లో దిగారు. అలల ఉధృతి ఒక్కసారిగా రావడంతో విజయ్ కుమార్ పట్నాయక్ మునిగిపోయాడు. సిబిరాజ్ అప్రమత్తమై తీరానికి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. విజయ్‌కుమార్ పట్నాయక్ మునిగిపోతున్న విషయాన్ని గమనించిన లైఫ్ గార్డ్స్, మెరైన్ పోలీసులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విజయ్‌కుమార్ మృతి చెందాడు. విజయ్ కుమార్ మృతదేహాన్ని లైఫ్‌గార్డ్స్ తీరానికి తీసుకుని వచ్చి పీఎం పాలెం పోలీసులకు సమాచారం అందించారు. వీరిద్దరు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు. బతుకు తెరువు కోసం కొన్నాళ్లుగా పెందుర్తిలో నివాసముంటున్నారు. విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ప్రకృతి కళకళ


ఒకపక్క వరినాట్లతో కళకళలాడుతున్న పొలాలు.. మరోపక్క కొండలను తాకుతున్న మేఘమాలలతో నాగులకొండ పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వర్షం కురిసిన కాసేపటి తరువాత ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. – రాజవొమ్మంగి

ఓటు హక్కు కోల్పోకుండా..!

- చిరునామాలో లేని ఓటర్ల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధానాన్ని అమలు చేస్తున్న జిల్లా అధికారులు
- జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 33,487 ఓట్లు గుర్తింపు
- వారి చిరునామాలు గుర్తించేందుకు ఆయా నియోజకవర్గాల ఈఆర్వోలకు బాధ్యతలు
- నియోజకవర్గ పరిధిలో ఉన్నారా లేదా అనే విషయాలపై ఆరా
- ఓటర్ల వివరాలు లభిస్తే.. ఫారం–8తో ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు


వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్

అడ్రస్ షిఫ్టింగ్ ఓటర్లుగా గుర్తించిన వారి వివరాలు...

నియోజకవర్గం	గుర్తించిన ఓటర్లు
భీమిలి	7171
విశాఖ తూర్పు	2064
విశాఖ దక్షిణం	2202
విశాఖ ఉత్తరం	1733
విశాఖ పశ్చిమం	9501
గాజువాక	5590
పెందుర్తి	5226

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ–2024 కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. ఇప్పటికే ఇంటింటా ఓట్ల పరిశీలన, కొత్త వారి నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, సవరణలు చేపట్టే కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల యంత్రాంగం పక్కాగా నిర్వహించింది. దానికి సంబంధించిన మదింపు ప్రక్రియ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఫారం–8కి సంబంధించి చిరునామాలో లేని వారి వివరాలను సేకరించేందుకు ప్రత్యేక ఫార్మాట్ తయారు చేసి ఆ ఓటర్ల వివరాలు సేకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇటీవల నిర్వహించిన డోర్ టూ డోర్ సర్వేలో ఈ తరహా ఓటర్లను 33,487 మందిని గుర్తించింది. వీరి వివరాలు సేకరించే పనిలో ఈఆర్వోలు నిమగ్నమయ్యారు. స్పెషల్ సమరీ రివిజన్–2023ను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా నిర్వహిస్తోంది. జిల్లా పరిధిలో ఉన్న ఓటర్లతో తుది జాబితా రూపొందేనాటికి రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి ఆరోపణలు తలెత్తకుండా డోర్ టు డోర్ సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఎన్నికల సిబ్బంది.. ఆ తర్వాత ప్రక్రియపైనా ప్రత్యేక దృష్టిసారించారు. డోర్ టు డోర్ సర్వేలో బూత్ లెవెల్ అధికారులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏ)లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటును పరిశీలించారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంట్లోనూ కొత్త ఓటర్లు ఉన్నారా.? ఆ చిరునామాతో ఉన్న ఓటర్లు ఉన్నారా.? లేకపోతే ఎక్కడికి వెళ్లారు..? ఆ ఓటును తీసెయ్యాలా.? చిరునామా మార్పు చేయాలా ఇలా విభిన్న కోణాల్లో వివరాలు సేకరించారు. అయితే గత ఎన్నికల సమయంలో నమోదైన ఓటర్ల జాబితాలో పొందుపరిచిన చిరునామాలో ప్రస్తుతం చాలా మంది ఓటర్లు లేని విషయాన్ని గుర్తించారు.

మరో సర్వే..

సర్వే పూర్తయిన అనంతరం అన్ని నియోజకవర్గాల జాబితాని క్రోడీకరించి అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి నవంబర్ 30 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, వివాదస్పద అంశాలు, ఆరోపణలు తలెత్తకుండా ఉండేందుకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సంకల్పించారు. ఇందులో భాగంగానే ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకూడదనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మరో సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో అడ్రస్ షిఫ్టింగ్ ఓటర్లను మొత్తం 33,487 మందిని గుర్తించారు. వారు జిల్లా పరిధిలో ఉన్న 7 నియోజకవర్గాల్లో ఎక్కడైనా ఉన్నారా.? లేదా అనే వివరాలను సేకరించే ప్రక్రియ ప్రారంభించారు. ఆ ఓటర్ల చిరునామా లభ్యమైతే ఆ నియోజకవర్గంలోకి వారి ఓటు హక్కును బదిలీ చేయాలా వద్దా అనే విషయాను సదరు ఓటరు అభిప్రాయాన్ని సేకరిస్తారు. బదిలీ చేయాలని కోరుకుంటే ఫారం–8 ద్వారా ప్రక్రియకు ఉపక్రమిస్తారు. ఈ సర్వే కారణంగా ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఈ బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోలకు జేసీ కేఎస్ విశ్వనాథన్ అప్పగించారు.

సవాలుగా స్వీకరిస్తున్నాం



ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైందే కాబట్టి ఒక్కో ఓటును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఎక్కడా తప్పు దొర్లకుండా ఉండేలా డోర్ టూ డోర్ సర్వే నిర్వహించాం. దీనికి సంబంధించిన మదింపు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 18,95,194 మంది ఓటర్లుండగా.. డోర్ టూ డోర్ సర్వేలో 17,81,629 మందిని గుర్తించాం. మిగిలిన వారిలో 25,675 మంది ఓటర్లు మృతి చెందినట్లు ధ్రువీకరణ జరిగింది. మరో 1,13,565 మంది ఓటర్లకు సంబంధించిన వివరాలు వెరిఫై చేయాల్సి ఉంది. డోర్ టూ డోర్ సర్వేలో కొత్త ఓటర్లుగా 48,195 మందిని గుర్తించాం. ఓటర్ జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పుల సమాచారాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేయడంతో పాటు బీఎల్వో యాప్‌లో నమోదు చేస్తున్నాం. సమస్య తలెత్తితో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 0891–2789798 నంబర్‌కు లేదా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. – డా.మల్లికార్జున, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

ఫారం–8 ద్వారా చిరునామా మార్పు



ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షణ చేసినందున బీఎల్‌వోలు ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా ఉండేలా ఓటరు జాబితాను పక్కాగా సేకరించారు. చాలా మంది ఓటర్లు డోర్ టూ డోర్ సర్వేలో ఆబ్‌సెంట్స్‌గానూ, చిరునామా మార్పుగానూ గుర్తించాం. జిల్లా పరిధిలో ఎక్కడైనా ఆ ఓటర్ల వివరాలు లభిస్తే వారి చిరునామాలు మార్చాలా వద్దా అనే నిర్ణయాన్ని ఓటరుకు అప్పగిస్తున్నాం. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఓటరు వివరాలను వీలైనంత త్వరగా గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాం. అభ్యంతరాలు, క్లెయిమ్స్ కోసం ప్రత్యేక క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నాం. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతను బీఎల్‌వోలుకు అప్పగించాం. డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరిస్తాం. ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.
– ఎస్. శ్రీనివాసమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,220
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,200
వెండి(కిలో):	రూ.80,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.1432
స్కిన్	: రూ.256
స్కిన్‌లెస్	: రూ.266

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	485.00
విజయనగరం	489.00
శ్రీకాకుళం	489.00